క్లుప్తంగా

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న పైడా కృష్ణప్రసాద్ దంపతులు

మద్దిలపాలెం: సీతారాముల కల్యాణ మహోత్సవం పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, రమాదేవి ఆధ్వర్యంలో ఆదివారం బాలాజీనగర్‌లో ఘనంగా జరిగింది. రంగనాథాచార్యులు, ఎస్.సీతారామాచార్యులు, ద్వారం త్యాగరాజు బృందం కీర్తనల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ లోక కల్యాణార్థం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని జరిపించడం ఆనందంగా ఉందన్నారు.

వైభవంగా మెగా షష్టి పూర్తి వేడుక



షష్టిపూర్తి జరుపుకొంటున్న దంపతులు

బీచ్ రోడ్డు: వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో మెగా షష్టి పూర్తి వేడుక ఘనంగా జరిగింది. 60 ఏళ్ల వయస్సు కలిగిన 102 దంపతులు పెళ్లి కొడుకు, పెళ్లి కూతురులా ముస్తాబై బాజా భజంత్రీల మధ్య పెళ్లి చేసుకున్నారు. ఈ సందర్భంగా వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ డిస్ట్రిక్ట్ వీ201ఏ గవర్నర్ కందుల నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటి సారిగా ఇంత పెద్ద సంఖ్యలో షష్టిపూర్తి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. వేద పండితులు గో పూజ, ఆయువు హోమం నిర్వహించారు.

కేంద్రం తీరుకు నిరసనగా వామపక్షాల పాదయాత్ర



ఇసుకతోటలో పాదయాత్ర చేస్తున్న వామపక్షాల నాయకులు

మద్దిలపాలెం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం జీవీఎంసీ 16వ వార్డులో పాదయాత్ర నిర్వహించారు. ఇసుకతోట, రజకవీధి, అంబేడ్కర్‌నగర్‌లో మోదీ హటావో దేశ్ బచావో అంటూ నినాదాలు చేస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పడాల గోవింద్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.కృష్ణారావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజార్‌లో తనిఖీలు



స్టాళ్ల రికార్డులు పరిశీలిస్తున్న యాసిన్

సీతమ్మధార: స్థానిక రైతుబజార్‌ను ఆదివారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ సందర్శించి తనిఖీలు చేశారు. రైతుల స్టాళ్ల వద్దకు వెళ్లి ఐడీ కార్డులు, రికార్డులు, ఉల్లిపాయలు, టామాటాలు, ధరల పట్టికలను పరిశీలించారు. బోర్డుపై ఉన్న ధరల ప్రకారం వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు విక్రయించాలని వ్యాపారులకు సూచించారు. సమస్యలేమైనా ఉంటే తక్షణమే తన నంబర్ 73311 54978కు కాల్ చేసి తెలియజేయాలని చెప్పారు. యాసిన్ వెంట రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ ఉన్నారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు..!

- ప్రారంభానికి నోచుకోని జీవీఎంసీ 'స్పోర్ట్స్ ఎరీనా'
- అధికారుల తీరుపై క్రీడాభిమానుల అసహనం



బాస్కెట్‌బాల్ క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన గోల్ పోస్టు



ఎంవీపీ కాలనీలోని జీవీఎంసీ స్పోర్ట్స్ ఎరీనా



అధునాతన షటిల్ కోర్టు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలో నిర్మించిన జీవీఎంసీ స్పోర్ట్స్ ఎరీనా ప్రారంభోత్సవానికి ఎదురు చూపులు చూస్తోంది. నిర్మాణం పూర్తి చేసుకుని దాదాపు 8 నెలలు గడుస్తున్నా జీవీఎంసీ యంత్రాంగం ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా జీవీఎంసీ ఆధ్వర్యంలో ఆరు నెలల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రకటించినా అందుకు అనుగుణంగా నిర్ణయాలు జరగలేదు. అయితే గతేడాది స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుపై ప్రభుత్వం చూపిన చొరవతో ఈ పనుల్లో పురోగతి కనిపించింది. ఈ మేరకు గతేడాది జులైలో దీని నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అయితే 8 నెలలు గడిచినా జీవీఎంసీ అధికారులు నేటికీ ప్రారంభించకపోవడంతో క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


ఇదీ ప్రాజెక్టు ఉద్దేశం ..నగరంలో క్రీడాకారుల ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ స్పోర్ట్స్ ఎరీనా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం నగరంలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం ఒక్కటే బహుళ క్రీడలకు వేదికగా నిలుస్తోంది. దీంతో పాటు మరో అధునాతన ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తేవాలనే కాంక్షతో జీవీఎంసీ ఈ ప్రాజెక్టును చేపట్టింది. రూ.24 కోట్లకు పైగా వ్యయంతో 2019లో ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. సింథటిక్ వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, చిల్డ్రన్ ఎరీనా, బాస్కెట్ బాల్ కోర్టు, సెటిల్ కోర్ట్స్, వాలిబాల్ కోర్ట్సు, స్విమ్మింగ్‌పూల్ ఇలా అనేక సౌకర్యాలు ఈ ఇండోర్ స్టేడియంలో అందుబాటులో ఉన్నాయి. దీంతో ఆయా సేవలను వినియోగించుకునేందుకు క్రీడాభిమానులు ఆశగా ఎదురుచుస్తున్నారు. దీని ప్రారంభంపై జీవీఎంసీ అధికారులు పలు సందర్భాల్లో ప్రకటనలు చేసినప్పటికీ అవేవి అమలుకు నోచుకోలేదు.

జీవీఎంసీ అధికారులు స్పందించాలి

రూ.కోట్లు ఖర్చుచేసి అందుబాటులోకి తెచ్చిన ఈ క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించడంలో జీవీఎంసీ తాత్సారం చేయడం బాధాకరం. పనులు పూర్తయి చాలా కాలం అయినప్పటికీ దీని ప్రారంభాన్ని ఎప్పటికప్పుడు అధికారులు వాయిదా వేస్తున్నారు. ఈ ప్రాంగణం వినియోగం ద్వారా ఎంతో మంది క్రీడాకారులకు లబ్ధి చేకూరనుంది. బహుళ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంతో స్థానికంగా ఎంతో మంది యువకులు, పెద్దలు ఈ క్రీడా ప్రాంగణాన్ని వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి ఇప్పటికైనా దీన్ని ప్రారంభించాలని కోరుతున్నాం.

– వర్మ,
ఎంవీపీ కాలనీ సెక్టార్–11

రైతుబజార్‌లో వెలగని విద్యుత్ దీపాలు



ఎంవీపీ రైతుబజార్‌లో వెలగని లైట్లు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో విద్యుత్ దీపాలు వెగడం లేదు. ఇది విశాలమైన రైతుబజార్. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇక్కడ అవసరమైన 16 చోట్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి బల్బులు అమర్చారు. వాటిలో కొన్నాళ్లుగా ఐదు చోట్ల దీపాలు వెలగడంలేదు. రైతుబాజర్ లోపల ఎస్టేట్ ఆఫీస్ పక్కన, ప్రధాన ద్వారం వద్ద, స్టాళ్ల వద్ద ఉన్న దీపాలు వెలగడం లేదు. దీంతో సాయంత్రం సమయంలో వినియోగదారులు చీకటిలో ఇబ్బందిపడుతున్నారు. రైతుబజార్ సాధారణంగా ప్రతి రోజూ సాయంత్రం 8 గంటల వరకు ఉంటుంది. ఆ సమయంలో రైతుబజార్‌కు వచ్చే వినియోగదారులు ఇబ్బందిపడుతున్నారు. చీకటి కావడంతో ఆ సమయంలో ఎక్కువగా వినియోగదార్ల జేబుల్లో సెల్‌ఫోన్‌లు మాయమవుతున్నాయి. ఇదిలా ఉండగా దూర ప్రాంతాల నుంచి కొందరు రైతులు ఇక్కడికి తెల్లవారుజామున 4 గంటలకే చేరుకుంటారు. చీకటిలో తమ స్టాళ్లలో కూరగాయలు పెట్టుకోవడానికి ఇబ్బందిపడుతున్నామని వారంతా చెబుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే ఇక్కడ విద్యుత్ దీపాలు వెలిగించాలని కోరుతున్నారు.

అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ సీహెచ్ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు, సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని, లేనిపక్షంలో పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చాలా మంది రాత్రి పూట మద్యం తాగి గొడవలు సృష్టిస్తున్నారని, అటువంటి వాటిని ఉపేక్షించమన్నారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని చెప్పారు. అనంతరం రౌడీ షీటర్లను పోలీస్ సిబ్బంది దగ్గరుండి ఇళ్లకు పంపించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ధర్మేంద్ర, అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాలర్‌పై బోటు



తగరపువలస బైపాస్‌రోడ్డు వద్ద ట్రాలర్‌పై ప్రయాణిస్తున్న బోటు

తగరపువలస: నీటిపై ప్రయాణించాల్సిన బోటు ఆదివారం జాతీయరహదారిపై ట్రాలర్‌పై దూసుకుపోయింది. సంగివలస బైపాస్‌రోడ్డు హోటల్ వద్ద ట్రాలర్ సిబ్బంది భోజనానికి వాహనాన్ని నిలిపివేసినప్పుడు ఈ మార్గం ద్వారా రాకపోకలు సాగించేవారు సెల్ఫీలు తీసుకున్నారు. కేరళలోని కొచ్చి నుంచి ఒడిశాకు ఈ బోటును రవాణా చేస్తున్నట్టు ట్రాలర్ సిబ్బంది తెలిపారు.

'ఒక ప్రేమికుడు.. ఒక భావుకుడు' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

సీతంపేట: రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు రచించిన »ఒక ప్రేమికుడు.. ఒక భావుకుడు« గ్రంథావిష్కరణ సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రామారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి రచయిత, విమర్శకుడు డాక్టర్ కలశపూడి శ్రీనివాసరావు గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆచార్య ప్రయాగ సుబ్రహ్మణ్యం పుస్తకాన్ని సమీక్షించారు. డాక్టర్ రాచకొండ నరసింహశర్మ జీవిత చరిత్ర, జీవనయానాన్ని చాలా ప్రతిభావంతంగా గ్రంథస్తం చేశారని రచయిత సూర్యారావును కొనియాడారు. రాచకొండతో తన అనుభవాలను సూర్యారావు సభికులకు వివరించారు. రావిశాస్త్రి తమ్ముడిగా సుపరిచితుడైన నరసింహశర్మ అమెరికాలో 1968 నుంచి 2005 వరకు వైద్యుడిగా సేవలందించి, 2005లో విశాఖలో స్థిరపడినట్టు తెలిపారు. ప్రస్తుతం ఆయన వయస్సు 99 ఏళ్లు అన్నారు. నరసింహశర్మ ఇప్పటి వరకు 11 పోయిట్రీ పుస్తకాలను ఇంగ్లిష్ నుంచి తెలుగులోకి.. తెలుగు నుంచి ఇంగ్లిష్‌లోకి అనువాదం చేశారని చెప్పారు. నరసింహశర్మ వైద్యుడిగా, సాహితీవేత్తగా చేసిన సేవ, కృషి, కుటుంబ సభ్యుల జీవిత చరిత్రను పుస్తకంలో పొందుపర్చానన్నారు. అనంతరం నరసింహశర్మ తన అనుభవాలను వివరించారు.

వైదికులు, సిబ్బందికి నూతన వస్త్రాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తొలి విడత చందనం అరగదీత కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైదికులతో పాటు బ్బందికి ఈవో త్రినాథరావు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, డిప్యూటీ ఈవో సుజాత, ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు, ట్రస్టుబోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్ రాజ్, దొడ్డి రమణ, వంకాయల సాయినిర్మల పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పరిధి లీలాసుందరి నగర్‌లో ఆదివారం టీడీపీ నాయకులు ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమం చేపట్టారు. కాలనీలో ఇంటింటికీ వెళ్లి వారి ఓట్లు ఉన్నాయో? లేదో? పరిశీలించారు. గతంలో ఓట్లు ఉండి ఇటీవల గల్లంతైన వారిని గుర్తించి మళ్లీ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఒమ్మి అప్పలరాజు, ఏడువాక సన్యాసిరావు, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

'బీసీలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు'

ఎంవీపీ కాలనీ: బీసీ కులాలైన బోయవాల్మీకి, బెంతొ ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఆదివాసి రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో ఆదివాసి జేఏసీ రాష్ట్ర కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఆయా కులాలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బాగా అభివృద్ధి చెందాయన్నారు. ఈ చర్య గిరిజనుల హక్కులను కాలరాయడమే అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ బాబూరావునాయుడు, మాజీ ఎమ్మెల్యేలు చంద లింగయ్య, నిమ్మక జయరాజు, జేఏసీ రాష్ట్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు



బాడీ బిల్డింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు

పెదగంట్యాడ: సంపూర్ణ ఆరోగ్యానికి నిరంతర వ్యాయామం అవసరమని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఐపీఏ, ఎన్‌పీసీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 65వ వార్డు పరిధి వికాస్‌నగర్ రాజీవ్ ఇండోర్ స్టేడియంలో సౌత్ ఇండియా లెవల్ బాడీ బిల్డింగ్ అండ్ ఫిజిక్ చాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాడీ బిల్డింగ్‌లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ఈ పోటీల్లో సౌతిండియా రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, ఎన్‌పీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, మణికంఠ, ఢిల్లీ, గరికిన పైడిరాజు, పేర్ల అప్పారావు, రంజిత్, శంకరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు ఘన వీడ్కోలు



శివ శంకర్‌కు వీడ్కోలు పలుకుతున్న ఉద్యోగులు

బీచ్ రోడ్డు: పదోన్నతులతో బదిలీపై వెళ్తున్న పలువురు అధికారులకు ఆదివారం ఒక హోటల్‌లో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ ఆఫీసర్‌గా పదోన్నతిపై జమ్ము అండ్ కశ్మీర్ వెళ్తున్న నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా విశాఖపట్నం ప్రాజెక్ట్ డైరెక్టర్ పట్నాల శివ శంకర్‌కు ఘన వీడ్కోలు పలికారు. అలాగే డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొంది కేరళకు బదిలీ అయిన పి.మీరా అనూష, డిప్యూటీ మేనేజర్‌గా పదోన్నతిపై బెంగళూరుకు బదిలీ అయిన సిహెచ్.రవీంద్రబాబులను సన్మానించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ 150 కిలోమీటర్ల మేర ఆరు లైన్ల హైవే పనులను సమర్ధవంతంగా పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ప్రాజెక్ట్ డైరెక్టర్ రోహిత్ కుమార్, డిప్యూటీ మేనేజర్లు కిరణ్‌కుమార్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

రెండు వారాలకే పూల మొక్కలు మాయం!



ముడసర్లోవ రిజర్వాయర్ వెనక కారిడార్లలో పూల మొక్కలు, పచ్చిక మేస్తున్న పశువులు

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయరు వెనక రోడ్ల మధ్య కారిడార్లలో నాటిన పూల మొక్కలు రెండు వారాలకే మాయమయ్యాయి. గత నెల 28 నుంచి నాలుగు రోజుల పాటు నగరంలో జరిగిన జీ–20 దేశాల సదస్సును పురస్కరించుకుని జీవీఎంసీ అధికారులు ముడసర్లోవ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. జీ–20 దేశాల ప్రతినిధులు ముడసర్లోవలో ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను సందర్శించిన విషయం తెలిసిందే. దీంతో అధికారులు ఇక్కడి రోడ్లను సుందరీకరించారు. రిజర్వాయర్ వెనుక రోడ్ల మధ్య డివైడర్లపై వివిధ రకాల పూల మొక్కలు నాటించారు. అంత వరకు బాగానే ఉంది. ఈ పూల మొక్కల సంరక్షణ మాత్రం గాలికి వదిలేశారు. దీంతో నాటిన మొక్కలను పశువులు తినేస్తున్నాయి. పచ్చిక మేయడానికి డివైడర్లపైకి ఎక్కిన పశువులు పచ్చికతో పాటు పూల మొక్కలను తింటున్నాయి. జీవీఎంసీ ఉద్యానవన అధికారులు స్పందించి పూల మొక్కలు, పచ్చదనం పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యా సమాచారమ్

సాంఘిక దురాచారాలపై కందుకూరి అలుపెరగని పోరాటం

ఏయూ క్యాంపస్: సాంఘిక దురాచారాలపై కందుకూరి వీరేశలింగం పంతులు అలుపెరగని పోరాటం చేశారని సమైక్యభారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు విభాగం ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం పంతులు 175వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కన్నయ్య మాట్లాడుతూ సమాజం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి కందుకూరి అని కొనియాడారు. ఆత్మీయ అతిథి ఆచార్య జి.యోహాన్‌బాబు మాట్లాడుతూ సమాజ ఉద్ధరణకు రచనను ఆయుధంగా మార్చుకుని అనేక సాహిత్య ప్రక్రియల్లో కందుకూరి సృజనాత్మక రచనలు చేశారన్నారు. ప్రత్యేక అతిథి ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ కందుకూరి ఆధునిక యుగకర్త అని, తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన మహోన్నతుడని చెప్పారు. ముఖ్యంగా నాటక రంగం సాధనంగా సమాజానికి సందేశాన్ని ఇచ్చిన స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. అందుకే కందుకూరి జన్మదినాన్ని తెలుగు నాటకరంగ దినోత్సవంగా జరుపుకొంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కట్టిపోగు రత్నశేఖర్, డాక్టర్ మరడాన సుబ్బారావు, డాక్టర్ ఎల్.గిరీష్‌కుమార్, యం.స్వామి, కె.గోవిందరావు, ఆర్.మధు, స్వామి, కుశరాజు, షణ్ముఖరావు, ఢిల్లీ, ధనలక్ష్మి, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్సవ విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

డీన్ వాన్ లీవెన్ సెంటర్ ప్రారంభం



చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి బాలరాజు

ఎంవీపీ కాలనీ: దివంగత డీన్ వాన్ లీవెన్ సూచించిన కోప రహిత సమాజమే లక్ష్యంగా ఎంవీపీ కాలనీలో సెక్టార్ –3లో డీన్ వాన్ లీవెన్ సెంటర్‌ను మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న గందరగోళ పరిస్థితులకు ఆగ్రహమే ప్రధాన కారణమన్నారు. సంఘర్షణలతో నడిచే సమాజాన్ని సన్మార్గంలో నడిపించేది శాంతి ఒక్కటే అన్నారు. దివంగత డీన్ వాన్ లీవెన్ సూచించిన కోపం లేని జీవిత సూత్రం ద్వారానే శాంతిస్థాపన సాధ్యమవుతుందన్నారు. భాషావేత్త డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ డీన్ వాన్ లీవెన్ ఆలోచనల స్థాపనకు చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

ఘనంగా ఒరియా, తెలుగు సంగమం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బైజయంత్ జై పాండా

ఎంవీపీ కాలనీ: ఒరిస్సా వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో ఒరియా, తెలుగు సంగమంను ఘనంగా నిర్వహించారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయం ఆవరణలో ఆదివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమాన్ని పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ జై పాండా ముఖ్యఅతిథిగా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, ఒడిశాలు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న రాష్ట్రాలు అన్నారు. అన్ని అంశాల్లోను ఇచ్చుపుచ్చుకొనే ధోరణితో అభివృద్ధికి ముందడుగు వేయాలన్నారు. పార్టీ జాతీయ కార్యదర్శి సునీల్ దేవధర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహరావు, విష్ణుకుమార్‌రాజు, పీవీఎన్ మాధవ్, మేడపాటి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం ప్రసన్న వేంకటేశ్వరుడి కల్యాణం



శ్రీనివాసనగర్‌లో నిర్వహిస్తున్న లక్ష్మీప్రసన్న వేంకటేశ్వర స్వామి కల్యాణం

సీతంపేట: చైత్ర బహుళ ఏకాదశి సందర్భంగా కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో కొలువైన శ్రీలక్ష్మీప్రసన్న వేంకటేశ్వర స్వామి 17వ వార్షిక కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. చూడముచ్చటగా తీర్చిదిద్దిన పూల మండపంపై లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరుల ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, పూల దండలు, ఆభరణాలతో అలంకరించి కల్యాణం జరిపించారు. పాంచరాత్ర ఆగమ ప్రవీణుడు ఆరవెల్లి సీతారామాచార్యులు పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు గోపినంబాళ్ల వేంకట కూర్మాచార్యులు వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. శ్రీవారి కల్యాణానికి ముందుగా ఎదురు సన్నాహ ఉత్సవం ఉత్సాహంగా జరిగింది. ఉదయం స్వామి వారికి పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, విష్వక్సేన పూజా పుణ్యాహవాచనం, రక్షా సూత్ర బంధన, అర్చన చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి శ్రీనివాసుడి కల్యాణం తిలకించారు.

ప్రైవేటీకరిస్తే కార్మికవర్గం సహించదు



794వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల కష్టాలను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీల యజమానులకు కొమ్ము కాస్తున్న కేంద్ర ప్రభుత్వంపై తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, ప్రైవేటీకరణ చేస్తే కార్మిక వర్గం సహించదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్ష 794వ రోజుకు చేరుకుంది. సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు ఈ దీక్షలో పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించి, పూర్తిస్థాయి ఉత్పత్తిని పునరుద్ధరించాలని, బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని నాయకులు కోరారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా ప్రజలను చైతన్యం చేసే విధంగా కార్మికులు ఈ నెల 25వ తేదీన సీఎండీ, డైరెక్టర్ల బంగ్లాలను, ఇళ్లను ముట్టడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.